క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న శశిధర్‌రెడ్డి

నడిగూడెం : మండల పరిధిలోని కాగితరామ చంద్రాపురం గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త లేళ్ల లింగయ్యయాదవ్ భార్య వీరమణి అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో సోమవారం కోదాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కన్మంత రెడ్డి శశిధర్‌రెడ్డి లింగయ్య యాదవ్ కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కరక్కాయలగూడెం సర్పంచ్ నూకల యుగేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు ప్రవీణ్ కుమార్, రఫీ తదితరులు ఉన్నారు.

ఈవెంట్స్‌లో 77 మంది అర్హత


అర్హత సాధించిన పోలీస్ అభ్యర్థులతో పీఈటీ పల్లపు నాగేశ్వరరావు

నడిగూడెం : నల్గొండలో నిర్వహిస్తున్న పోలీస్ ఈవెంట్స్‌లో నడిగూడెం, మునగాల మండలాలకు చెందిన 77 మంది అర్హత సాధించినట్లు ఆ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు పల్లపు నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో అభ్యర్థులను అభినందించి మాట్లాడారు. నడిగూడెంబాలుర ఉన్నత పాఠశాలలో ఉన్న విశాలమైన క్రీడా స్థలంలో వారితో నిత్యం సాధన చేయించడంతో అర్హత సాధించినట్లు పేర్కొన్నారు.

ఉత్తమ క్లబ్‌గా ఎంపిక


అవార్డు అందుకుంటున్న నేరేడుచర్ల వాసవీ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : నేరేడుచర్ల వాసవీ క్లబ్ 2020 సంవత్సరంలో చేపట్టిన సేవా కార్యక్రమాలకు గాను ఆ సంఘం ఉత్తమ క్లబ్‌గా ఎంపిక చేసింది. ఈమేరకు సోమవారం మిర్యాలగూడలో ఆ సంఘం గవర్నర్ వంగవీటి గురుమూర్తి చేతుల మీదుగా నేరేడుచర్ల వాసవీ క్లబ్ సభ్యులు అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా వాసవీక్లబ్ అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్ మాట్లాడుతూ.. వాసవీ క్లబ్ ద్వారా ఈ ఏడాది మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, కోటేశ్వర్‌రావు, అశోక్, మురారిశెట్టి రమేష్, జ్యోతి తదితరులున్నారు.

క్షేత్ర పర్యటనతో విజ్ఞానాభివృద్ధి

కోదాడ అర్బన్ : క్షేత్ర స్థాయి పర్యటనతో విద్యార్థుల్లో సత్వర విజ్ఞానాభివృద్ధి కలుగుతుందని కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణ అన్నారు. ఇటీవల కళాశాలకు చెందిన బీటెక్ విద్యార్థినులు విశాఖ ఉక్కు కర్మాగారాన్ని సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. యూనిట్ ఇన్‌చార్జ్ నాగేశ్వరరావు విద్యార్థులకు ఉక్కు తయారీ, యంత్రాల పనితీరు గురించి వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం


విరాళం అందజేస్తున్న దాతలు

నడిగూడెం : మండల పరిధిలోని రత్నవరంలో గల శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో గరుడ వాహనం కొనుగోలుకు చాకిరాల గ్రామానికి చెందిన గడ్డమీద మల్లయ్య మనుమరాలు గుండ్ల ఫల్గుణి –చరణ్ దంపతులు రూ.65 వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు. గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

వనితా క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక


వీరేల్లి శ్రీలత, అధ్యక్షురాలు


బొలిశెట్టి సంధ్య, ప్రధాన కార్యదర్శి

నేరేడుచర్ల : నేరేడుచర్ల వనితా క్లబ్ నూతన కార్యవర్గాన్ని వాసవీ క్లబ్ జిల్లా క్యాబినేట్ కోశాధికారి రాచకొండ విజయలక్ష్మి సమక్షంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా వీరేల్లి శ్రీలత, ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సంధ్య, కోశాధికారిగా ఈగ భాగ్యలక్ష్మిలు ఎన్నికయ్యారు. కాగా ఎన్నికల అధికారిగా వనితా క్లబ్ రీజనల్ చైర్మన్ రాయపూడి భవాని వ్యవహరించారు. కార్యక్రమంలో ఆ క్లబ్ రీజనల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌రావు, వాసవీక్లబ్ అధ్యక్షుడు లక్ష్మణ్, కోశాధికారి కోటేశ్వర్‌రావు, వాసంతి, శ్రీనివాస్‌రావు, నాటరాజ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు


మేళ్లచెరువు శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


మునగాల : బరాఖత్‌గూడెంలో ఉత్తరముఖ ద్వారం గుండా స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


హుజూర్‌నగర్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీ ఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభు లింగేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా విశిష్ట పూజలు నిర్వహించారు. ఉత్తర ద్వారం గుండా భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా పుణ్యావచనం, పంచామృతాభిషేకాలు, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ గుజ్జుల కొండారెడ్డి, అర్చకులు కొంకపాక విష్ణువర్ధన్ శర్మ, ధనుంజయశర్మ, భక్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

మునగాల : మండలంలోని పలు దేవాలయాల్లో సోమవారం ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. ప్రధానంగా తెలంగాణలో ఉత్తర ముఖ ద్వారం కలిగిన బరాఖత్ గూడెంలో గల శ్రీస్వయంభు వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, కృష్ణా జిల్లా నుంచి భక్తులు దాదాపు పదివేల మంది భక్తులు తెల్లవారుజామున 4 గంటల నుంచే క్యూ కట్టి స్వామివారిని ఉత్తర ముఖ ద్వారం గుండా దర్శించుకున్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూజారి కందాళ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో గ్రామంలోని పుర వీధులలో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్షుడు బొంతు మోహన్‌రావు, ఈఓ చలపతిరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపాల గ్రామంలో..

మండలంలోని రేపాలలో గల శ్రీస్వయంభు లక్ష్మీనరసింహస్వామి, శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి ఆయంలో స్వామివారి ఉత్తర ముఖద్వార దర్శనాన్ని భక్తులు తిలకించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పానుగోటి, గ్రామపెద్దలు మొగిలిచెర్ల సత్యనారాయణ, పానుగోటి రంగా పాల్గొన్నారు.

మఠంపల్లిలో ఉత్తమ్ పూజలు

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో సోమవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పద్మావతి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కు ఆలయ పాలకవర్గం, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. పూజల అనంతరం ఉత్తమ్ దంపతులను శేషవస్త్రాలతో సత్కరించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తాను వందల కోట్ల రూపాయలతో కరకట్టలు, కృష్ణానదిపై వంతెన నిర్మించినట్లు గుర్తు చేశారు. అనంతరం క్షేత్రంలోని వివిధ కులాల అన్నదాన సత్రాలను సందర్శించారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో రూ.50 కోట్లతో కృష్ణా నదిపై నిర్మించిన వంతెనను పరిశీలించారు.

పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బొల్లం..

మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పాలకవర్గం అర్చకులు ఆయనను శేషవస్త్రాలతో సత్కరించి ఆశీర్వచనాలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ధర్మకర్తలు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్, నాయకులు మంజీనాయక్, శివారెడ్డి, అప్పారావు, ఎంపీపీలు పార్వతీకొండా నాయక్ గోపాల్‌నాయక్, జట్పీటీసీ జగన్‌నాయక్, కె.లక్ష్మీవెంకటనారాయణ తదితరులున్నారు.

చిలుకూరులోని చెన్నకేశవస్వామి ఆలయంలో..

చిలుకూరు : మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో సోమవారం వైకుంఠ ఏకాదశి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చిలుకూరు చెన్నకేశవస్వామి ఆలయంలో పూజారి సిరికొండ అనంత కృష్ణామాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బూరుగడ్డ ఆలయంలో..

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీ ఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి గోదాదేవి ఉత్సవ విగ్రహాలను గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎంపీ లక్ష్మణరావు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్, ఆలయ సిబ్బంది గోవింద రెడ్డి, కిరణ్‌కుమార్‌గౌడ్ రమేష్, ఉపేందర్, అర్చకుడు హరీష్‌కుమార్‌చార్యులు, భక్తులు పాల్గొన్నారు.


మఠంపల్లి: మట్టపల్లిలో పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్


హుజూర్‌నగర్‌రూరల్ : స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

గరిడేపల్లి మండలంలో..

గరిడేపల్లి : మండల వ్యాప్తంగా గల దేవాలయాల్లో సోమవారం ముక్కోటి ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించారు. స్వామివార్లకు అభిషేకం చేశారు. గోదాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయాల ప్రధాన అర్చకులు తదితరులున్నారు.

శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో..

మఠంపల్లి : మండల కేంద్రంలోని శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం గ్రామోత్సవం గావించారు. అదేవిధంగా శ్రీఅమ్మవార్లకు మహిళలు కుంకుమపూజలు నిర్వహించారు. అర్చకులు నరగిరి నాధుని శ్రీనివాసాచార్యులు, మహిళలు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : మండలంలో ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. నేరేడుచర్లలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం, దిర్శించర్లలోని రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో అర్చకులు అన్నంబోట్ల ఫణికుమారశర్మ, ఈరుగంటి శ్రీనివాస్‌శాస్త్రిల ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయాల చైర్మన్లు చెన్నబోయిన నవీన్, లక్ష్మీనారాయణ, బీజేపీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, హరి, భక్తులు పాల్గొన్నారు.

మోతె : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని ఆలయాల్లో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. రావిపహాడ్ గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో ఉత్తర ద్వారం గుండా స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పూజారి కిసికళ్ల ప్రభాకర్‌శాస్త్రి, భక్తులు పాల్గొన్నారు.

నడిగూడెం : మండల వ్యాప్తంగా దేవాలయాలలో సోమవారం వైకుంఠ ఏకాదశి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లోని పలు ఆలయాల్లో సోమవారం ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ప్రత్యేక పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు, అభివృద్ధి కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.


చిలుకూరు చెన్నకేశవ ఆలయంలో..


నేరేడుచర్ల : దిర్శించర్లలో..


మఠంపల్లి : వేణుగోపాలస్వామి ఆలయంలో..


నడిగూడెం : సిరిపురంలో..

కూలి రేట్లు పెంచాలని ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న టైలర్లు

హుజూర్‌నగర్ : ప్రస్తుతం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా టైలరింగ్ వర్కర్ల కూలి రేట్లు పెంచాలని టైలరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎస్‌కే బాజీ ఉల్లా కోరారు. సోమవారం హుజూర్‌నగర్‌లో ఆ సంఘం ఆధ్వర్యంలో సమ్మె చేసి అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఇస్తున్న కూలి రేట్లు డిసెంబర్‌తో ముగిసినందున ఈనెల నుంచి నూతన రేట్లు అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్కర్స్ యూనియన్ నాయకులు సిగ సత్యనారాయణ, రామకృష్ణ, డేవిడ్, రాము, వెంకన్న, రమేష్, వలి, మీరా, నాగయ్య, శ్రీను, చందర్‌రావు, నర్సింహారావు, మధు పాల్గొన్నారు.

నేడు టీఎల్‌ఎం ప్రదర్శన

మోతె : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో తొలిమెట్టు (ఎఫ్‌ఎల్‌ఎన్) కార్యక్రమంలో భాగంగా మంగళవారం నిర్వహించే టీచర్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్‌ఎం) బోధనాభ్యాసన సామగ్రి ప్రదర్శనకు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు హాజరు కావాలని ఎంఈఓ గోపాల్‌రావు సోమవారం కోరారు. తెలుగు, గణితం, ఆంగ్లం, పరిసరాల విజ్ఞానం సబ్జెక్ట్‌ల ఉపాధ్యాయులు హాజరై టీఎల్‌ఎం ప్రదర్శించాలన్నారు.

నడిగూడెంలో..

నడిగూడెం : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా 3, 4 తేదీలలో టీచర్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్‌ఎం) ప్రదర్శన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి ఎండీ.సలీం షరీఫ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3న నడిగూడెం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలు, 4న తెల్లబల్లి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు


కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ సుజాతశ్రీనివాస్ గౌడ్

గరిడేపల్లి : నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పెండెం సుజాతశ్రీనివాస్‌గౌడ్ కేక్ కట్ చేసి ఉద్యోగులకు పంపిణీ చేశారు. అనంతరం ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఏఈఈ సుధీర్, సుపరింటిండెంట్ సుభాని, ఉద్యోగులు మోయినోద్దీన్, మహేష్, భద్రయ్య, వరుణ్, సుజాత, సిబ్బంది ఉన్నారు.

కేంద్ర పథకాలను ప్రతి ఇంటికి చేర్చాలి


సమావేశంలో మాట్లాడుతున్న బొబ్బా భాగ్యరెడి

పాలకవీడు : ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన శక్తి కేంద్ర, ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని కోరారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీజేపీని గెలిపించడానికి సిద్ధంగా ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు గుండ్రెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మండల ఇన్‌చార్జ్ నరసింహ, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు నరేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మట్టారెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, చిన్నలాజరు, సైదానాయక్, శ్రీనివాస్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ పర్యటనను జయప్రదం చేయాలి

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో ఈ నెల 6వ తేదీన బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అమర్‌నాథ్ రెడ్డి కోరారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన మంత్రి పర్యటన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు మంత్రి పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకుని జయప్రదం చేయాలని అన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చన రవి, పార్టీ నాయకులు కేఎల్‌ఎన్ రెడ్డి, అట్లూరి హరిబాబు, నర్సింగ్ వెంకటేశ్వర్లు, యరగాని శ్రీను, అమర్‌గౌడ్, జక్కుల నాగేశ్వరరావు, దొంతగాని శ్రీనివాస్, కె.శ్రీను, శంభయ్య, ఫణి రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ఈనెల 6వ తేదీన వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనలకు రానున్న మంత్రి కల్వకుంట్ల తారక రామారావు పర్యటనను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు కోరారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో అయన మాట్లాడారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీపీ లకుమళ్ల జ్యోతి, జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య, వైస్ ఎంపీపీ తాళ్లూరి లక్ష్మీనారాయణ, నాయకులు సోమిరెడ్డి రమేష్‌బాబు తదితరులున్నారు.


హుజూర్‌నగర్ : సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న అమర్‌నాథ్‌రెడ్డి

నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలి

మఠంపల్లి : హుజూర్‌నగర్‌లో ఈనెల 6వ తేదీన జరిగే మంత్రి కేటీఆర్ పర్యటనలో బీఆర్‌ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య కోరారు. సోమవారం మఠంపల్లిలోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ పార్వతీకొండా నాయక్, జెట్పీటీసీ జగన్‌నాయక్, సర్పంచ్‌లు లక్ష్మీనరసింహరాజు, విజయకుమారివెంకటరెడ్డి, రామారావు, వెంకటరమణ, హఫీజ్‌ఖాన్, నాయకులు నవీన్‌నాయక్, కుతుబ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్టు


చిలుకూరులో అరెస్టయిన కాంగ్రెస్ నాయకులు

హుజూర్‌నగర్ : రాష్ట్ర కాంగ్రెస్ పిలుపు మేరకు సర్పంచ్‌ల విధుల విషయంపై హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ వద్ద తలపెట్టిన ధర్నాకు వెళ్లకుండా స్థానిక కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం వదిలి పెట్టారు. అరెస్టయిన వారిలో నాయకులు శ్రవణ్ కుమార్, మేళ్లచెరువు ముక్కంటి, రవీందర్, రాము, యోహాన్, ముత్తయ్య రాము ఉన్నారు.

చింతలపాలెంలో...

రాష్ట్ర కాంగ్రెస్ పిలుపు మేరకు హైదరాబాద్ వెళ్లకుండా పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి అనంతరం విడిచి పెట్టారు.

నడిగూడెం : గ్రామ పంచాయతీలకు నిధులు రాకపోవడంతో సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీపీసీసీ పిలుపు మేరకు ప్రగతి భవన్ ముట్టడికి సోమవారం తరలివెళ్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులను నడిగూడెం పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టు అయిన వారిలో స్థానిక ఎంపీటీసీ గుండు శ్రీనివాస్, గుండు శ్రీను, గుండు మహేందర్, తదితరులు ఉన్నారు.

చిలుకూరు : గ్రామ పంచాయతీలకు నిధులు రాకపోవడంతో సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన ప్రగతి భవన్ ముట్టడికి స్థానిక కాంగ్రెస్ నాయకులు వెళ్లకుండా సోమవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఆ తరువాత వారిని వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టయిన వారిలో కాంగ్రెస్ నాయకులు యడవెల్లి పుల్లారావు, సొందుమియా, దొంతగాని నరసింహారావు, కొండా వీరబాబు, చిరంజీవి, భద్రయ్య, వినయ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

మునగాల : తెలంగాణలో సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని గణపవరంలో దాతల సహకారంతో నిర్మించిన ఆసరా ఫించన్ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన బీఆర్‌ఎస్ శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే ఎన్నికలలో బీఆర్‌ఎస్ పార్టీ సీఎం కేసీఆర్ సారధ్యంలో మూడవసారి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 30 కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో పలు పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేశారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎలక బిందు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు తొగరు రమేష్, ఎలక వెంకటరెడ్డి, సర్పంచ్ కొండపల్లి విజయమ్మ, మండల నాయకులు కందిబండ సత్యనారాయణ, సుంకర అజయ్‌కుమార్, గౌని శ్రీనివాస్‌యాదవ్, కె.సత్యనారాయణరెడ్డి, ముత్తయ్య, జితేందర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, నరసింహారావు పాల్గొన్నారు.


గణపవరంలో ఆసరా ఫించన్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్

బీఆర్‌ఎస్‌లోకి యూత్ కాంగ్రెస్ నేత

మునగాల : మండలంలోని తాడువాయి గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు సొంపంగు గోపి సోమవారం బీఆర్‌ఎస్‌లో చేశారు. ఈ సందర్భంగా మండలంలోని గణపవరంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ గోపికి గులాబీ జెండా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేష్, కందిబండ సత్యనారాయణ పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ


మోతె : సిరికొండలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

మోతె : ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లను వెంటనే చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పాపిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని సిరికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీఎస్‌యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వీఓటీటీ కన్వీనర్ లాలు, మండల ప్రధాన కార్యదర్శి నరేందర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎం శ్రీను, బి వీరన్న, ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

మునగాల : మండలంలోని తాడువాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం టీఎస్‌యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఆ సంఘం నాయకులు అల్లా భక్షు, రాజు, లక్ష్మీనారాయణ, కృష్ణవేణి, విజయలక్ష్మి, రాము, సత్తార్, కరుణాకర్, అభినవ్, ప్రవీణ్, బోస్ పాల్గొన్నారు.

రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


హుజూర్‌నగర్ : రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, జిల్లా కార్యదర్శి యల్క సోమయ్య అన్నారు. సోమవారం పట్టణంలో కార్మికులతో కలిసి రవాణా రంగ కార్మికుల సంఘర్ష యాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోటార్ వాహన చట్టం 2019ని సవరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, రాంబాబు, మస్తాన్, శ్రీను, వెంకట్, నారాయణ, జానీ, తిరపయ్య, రవి, కిరణ్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నడిగూడెం : ట్రాన్స్‌పోర్టు కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు మల్లెల వెంకన్న ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 4న సూర్యాపేట జిల్లా కేంద్రానికి ట్రాన్స్‌పోర్టు రంగ కార్మికుల సంఘర్ష యాత్ర వస్తుందని, ఆ కార్యక్రమంలో ప్రతి కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మామిడి రాము, రెంటాల శ్రీను, ఉపేందర్, సాయిలు పాల్గొన్నారు.


హుజూర్‌నగర్ : సంఘర్ష యాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

నేరేడుచర్ల : రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ నీలా రామ్మూర్తి డిమాండ్ చేశారు. సోమవారం నేరేడుచర్లలోని జాన్‌పహాడ్ రోడ్డు ఆటో యూనియన్ కార్మికులతో కలిసి కరపత్రాన్ని విడుదల చేసి మాట్లాడారు. 2007లో సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని వీవీగిరి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ సంస్థ కేంద్రానికి సిఫారస్ చేసినా నేటి వరకు అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు సైదా, మట్టయ్య, నాగరాజు, భద్రి, నవీన్‌రెడ్డి, అంజి, బాలు తదితరులున్నారు.

అయ్యప్ప మాలధారుల రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న అయ్యప్ప మాలధారులు

మఠంపల్లి : అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్, రేంజర్ల రాజేష్‌లను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మఠంపల్లిలోని ప్రధాన రహదారిపై అయ్యప్ప మాలధారులు రాస్తారోకో చేపట్టారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ ఇరుగు రవికి ఫిర్యాదు చేశారు. వెంకటశివ, గోపి, మురళి, సైదులు, నరేష్, వెంకటేష్, సైదిరెడ్డి, రవి, గురుప్రసాద్, తిరుపతయ్య ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ప్రాజెక్టు నిర్వహించాలని వినతి

దురాజ్‌పల్లి : సూర్యాపేట జిల్లాలో ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక ప్రాజెక్టు నిర్వహించాలని నడిగూడెంకు చెందిన వ్యవసాయ జర్నలిస్టు, ప్రకృతి వ్యవసాయం ప్రచారకర్త మొలుగూరి గోపయ్య కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, జిల్లా వ్యవసాయ అధికారి రామారావునాయక్‌లకు వినతిపత్రం అందించి మాట్లాడారు. జిల్లాలో పలువురు రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. పెట్టుబడులు తగ్గించుకొని సహజ సిద్ధ పద్ధతులు పాటిస్తూ ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని వివరించారు. ఇంకా అనేక మంది రైతులను చైతన్యపరచి అవగాహన కార్యక్రమం నిర్వహించాలని కోరారు.